

ఉధృతంగా పారుతున్న గొల్లపల్లి వంక



నెరవేరిన సీఎం చంద్రబాబు హామీ

• రామన్నకు రూ.60వేల ఆర్థికసాయం


రామన్నకు గొర్రెలు అందజేస్తున్న అధికారులు

మడకశిర, ఆగస్టు 17 : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని అధికారులు నెరవేర్చారు. పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆగస్టు 1న మడకశిర మండలం గుండుమల గ్రామంలో రామన్న ఇంటికి వచ్చిన సీఎం గొర్రెల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి హామీ మేరకు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ గొర్రెల కొనుగోలుకు రూ.60వేలు మంజూరు చేశారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య తదితరులు నగదు అందజేశారు. అనంతరం అదే గ్రామంలోని ఓబుళమ్మ ఇంటిని సందర్శించిన అధికారులు ఆమె ఇంటి నిర్మాణానికి రూ.3.50లక్షలు మంజూరు చేశారు. సీఎం హామీ మేరకు త్వరలోనే ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ ఎస్ఆర్ నాగరాజు, ఏపీఎం రవి, ఎల్‌సీసీ, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

నమో ఆంజనేయ..!

భక్తులతో కిటకిలాడిన పాలపాటిదిన్నె


ప్రత్యేకాలంకరణలో పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి

నల్లచెరువు, ఆగస్టు 17: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయం శ్రావణమాసం రెండో శనివారం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మండల ప్రజలతోపాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఉత్సవ విగ్రహం ఊరేగింపు



అలరించిన నృత్యరూపకం

పుట్టపర్తి, ఆగస్టు 17: బాలవికాస్ చిన్నారులు చేపట్టిన సంభవామి యుగే యుగే నృత్యరూపకం భక్తులను అలరింపచేసింది. రెండోరోజు శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మండపంలో ఎన్టీఆర్ జిల్లా భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పురాణాల్లోని ఘట్టాలను ప్రదర్శించారు. విజయవాడలోని కనకదుర్గ సన్నిధిలో పాడే భక్తిగీతాన్ని ఆలపించారు. స్వాతంత్ర్య ఉద్యమ ఘట్టాలపై పాటలు పాడారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.


నృత్యం చేస్తున్న చిన్నారులు



దంచికొట్టిన వాన

పొంగిపొర్లిన వాగులు, వంకలు


పోతులనాగేపల్లి వద్ద ఉధృతంగా పారుతున్న చిత్రావతి వంక

2 ఏళ్ల తర్వాత బీభత్సంగా పారిన చిత్రావతి వంక

ధర్మవరంరూరల్: ధర్మవరం పట్టణ, మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. ఈ వర్షానికి వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగిపోర్లాయి. పోతులనాగేపల్లి వద్ద చిత్రావతి వంక రెండేళ్ల తర్వాత బీభత్సంగా ప్రవహిస్తోంది. కుణుతూరు, గొల్లపల్లి వంక భారీగా పారింది. గరుడంపల్లి, చిగిచెర్ల, పోతులనాగేపల్లి తదితర గ్రామాల్లో చెక్‌డ్యాంలు నిండి పొంగిపొర్లాయి. వీపరీతమైన గాలులకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. కదిరిగేటు వద్ద ఉన్న నేతన్న విగ్రహం వద్ద పెద్ద వేప చెట్టు కొమ్మ విరిగిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. కుణుతూరు, రేగాటిపల్లి, సీసీకొత్తకోట, కనంపల్లి, పోతులనాగేపల్లి, మల్లాకాల్వ, గరుడంపల్లి, చిగిచెర్ల గ్రామాల్లో కాయగూరల తోటల్లో నీరు నిలిచి చెట్లు దెబ్బతిన్నాయి.

పుట్టపర్తిరూరల్/కొత్తచెరువు, ఆగస్టు 16: జిల్లాలో శుక్రవారం రాత్రి వాన దంచి కొట్టింది. దీంతో వంకలు వాగులు పొంగిపొర్లాయి. ధర్మవరం అనంతపురం ప్రధాన రహదారిపై పోతులనాగేపల్లి వద్ద చిత్రావతి నది ఉధృతంగా ప్రవహించింది. ధర్మవరంలోని పాండురంగవీధి, ఎన్టీఆర్ సర్కిల్, జట్కా స్టాండు తదితర ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పుట్టపర్తి మండలం గాజులపల్లి చెరువు మరువ పొంగిపొర్లింది. రూరల్ పరిధిలోని నిడిమామిడి కొట్లపల్లి వద్ద, కొత్తచెరువు- ధర్మవరం రోడ్డులో కొడపగానిపల్లి సత్యసాయి పంప్‌హౌస్ వద్ద బ్రిడ్జి పైనుంచి వంగపేరునది పొంగి పొర్లింది. పుట్టపర్తి మండలం గాజులపల్లి చెరువు నిండి ఉధృతంగా మరువ రావడంతో వంగపేరునది జలకళ సంతరించుకుంది. దీంతో వాహనాల రాకపోకలకు సుమారు మూడుగంటల పాటు అంతరాయం ఏర్పడింది. ఆర్టీసీ అధికారులు పెనుకొండ మీదుగా అనంతపురానికి బస్సులను నడిపారు. ప్రవాహం తగ్గిన అనంతరం బ్రిడ్జిపై మరమతులు చేసి రాకపోకలను పునరుద్ధరించినట్లు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వాగులు, వంకలు, చిన్న చిన్న కుంటలు వర్షపు నీటితో నిండిపోయాయి. గత కొన్ని రోజులుగా ఎండవేడిమి, ఉక్కపోతకు అల్లాడిపోతున్న ప్రజలకు శుక్రవారం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది.

జిల్లాలో కురిసిన వర్షపాతం వివరాలు ఇలా...

అమరాపురంలో 98.2 మిల్లీమీటర్లు, గోరంట్ల 95.4 మి.మీ, మడకశిర 88.4, చెన్నేకొత్తపల్లి 86.4, ముదిగుబ్బ 82.4, తాడిమర్రి 76.8, బుక్కపట్నం 75.6, బత్తలపల్లి 64.2, రామగిరి 62.8, కొత్తచెరువు 62.8, రొళ్ల 62.2, ధర్మవరం 54.6, కనగానపల్లి 54.2, పెనుకొండ 50.2, పుట్టపర్తి 45.2, సోమందేపల్లి 43.8, పరిగి 43.6, అగళి 42.6, గుడిబండ 41.6, చిలమత్తూరు 41.6, అమడగూరు 35.2, రొద్దం 32.2, నల్లమాడ 26.4, లేపాక్షి 25.2, హిందూపురం 19.4, ఓబుళదేవరచెరువు 18.4, తలుపుల 5.2, కదిరి 5.2, నల్లచెరువు 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు.


గరుడంపల్లి వద్ద పొంగిపొర్లుతున్న చెక్‌డ్యాం


ధర్మవరంలో పూట్నీమండీ వీధిలో వర్షపునీరు

టీడీపీదే కుర్చీ !

తెలుగుదేశం పార్టీకి లైన్‌క్లియర్.. చైర్‌పర్సన్ రాజీనామాతో మార్గం సుగమం

సభ్యుల ఆమోదమే తరువాయి

ఈనెల 20న ప్రత్యేక సమావేశం

హిందూపురం, ఆగస్టు 17: మున్సిపల్ పీఠం అధిష్ఠించేందుకు టీడీపీకి లైన్ క్లియర్ అయ్యింది. వైసీపీకి చెందిన మునిసిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ టీడీపీలో చేరి తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అలాగే ఎక్కువమంది కౌన్సిలర్లు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరడంతో చైర్మన్ పీఠం సులువుగా టీడీపీ పరం కానుంది. 2021లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు వైసీపీ గెలిచింది. మునిసిపల్ చైర్మన్ స్థానం జనరల్ వ్యక్తికి అయినప్పటికీ పార్టీలో అంతర్గత వ్యవహారాల నేపథ్యంలో బీసీ కులానికి చెందిన ఇంద్రజకు చైర్‌పర్సన్‌గా వైసీపీ అవకాశం కల్పించింది. అయితే మొదటి రెండు మూడు నెలలు మాత్రమే పాలన సజావుగా సాగింది. ఆ తరువాత అన్నీ ఒడిదుడుకులే. పాలకవర్గంలో ఉన్న వైసీపీ సభ్యులు రెండు వర్గాలుండగా విడిపోవడంతో ఇంద్రజకు పదవి ముళ్లకిరీటంగా మారింది. అయినా అప్పటి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇక్బాల్ సహకారంతో వ్యవహారం సజావుగానే సాగింది. కానీ 2023లో ఇక్బాల్‌ను ఇన్‌చార్జ్‌గా తొలగించారు. దీపిక ఇన్‌చార్జ్‌గా వచ్చింది. అప్పటి నుంచి చైర్‌పర్సన్‌కు మరిన్ని కష్టాలు పెరిగాయి. పేరుకు చైర్‌పర్సన్ అయినా హక్కులన్నీ వైసీపీ నాయకులు లాక్కున్నారు. ఈ పరిస్థితుల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో వైసీపీని వీడాలని చాలా మంది సొంత పార్టీ సభ్యులే సూచించారు. ఈక్రమంలో చైర్‌పర్సన్‌గా వైసీపీలో ఉండి అవమానం భరించడం కంటే పదవినే త్యాగంచేసి టీడీపీలో గౌరవంగా ఉండాలని నిర్ణయించుకుని రెండు రోజుల కిందట పచ్చకండువా కప్పుకున్నారు. పార్టీలో చేరి మరుసటి రోజే చైర్‌పర్సన్ పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు.



మార్గం సుగమం

హిందూపురం మునిసిపాలిటీలో 38వార్డులుండగా 2021లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ 30స్థానాలు తెలుగుదేశం 6, బీజేపీ1, ఎంఐఎం1 గెలిచాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందే వైసీపీకి చెందిన ఇద్దరు, ఎంఐఎం సభ్యురాలు టీడీపీలోకి చేరడంతో ఆపార్టీ బలం 9కి పెరిగింది. బీజేపీ కౌన్సిలర్‌తో కలుసుకుని పది మంది ఉండగా రెండ్రోజుల క్రితం చైర్‌పర్సన్ ఇంద్రజతోపాటు ఎనిమిది మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. దీంతో తెలుగుదేశం బలం 19కి పెరిగిన నేపథ్యంలో మునిసిపల్ చైర్‌పర్సన్ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఈనెల 20న మునిసిపల్ అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో చైర్‌పర్సన్ రాజీనామాను మెజార్టీ సభ్యులు తీర్మానం చేస్తే ఇక ఆమె పదవి కోల్పోయినట్లే. తెలుగుదేశం పార్టీ తరఫున చైర్మన్ కావడానికి 20మంది సభ్యులు అవసరం కాగా 19మంది కౌన్సిలర్లతోపాటు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఎంపీ, ఎమ్మెల్యే ఓటు ఉండటంతో కావాల్సినదాని కంటే ఒక్క ఓటు అధికంగానే ఉంది. ఆ ప్రకారం తెలుగుదేశం పార్టీకి 21ఓట్లు, వైసీపీకి 18ఓట్లే ఉంటాయి. కానీ మరికొంతమంది వైసీపీ కౌన్సిలర్లు కూడా తెలుగుదేశం పార్టీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

వైస్ చైర్మన్ కోసం టీడీపీలో పోటీ

తెలుగుదేశం పార్టీ తరఫున చైర్మన్ స్థానానికి అభ్యర్థి ఖరారైనట్లే భావిస్తున్నారు. కానీ రెండు వైస్ చైర్మన్ పదవులు ఉన్నాయి. వాటిలో వైసీపీ వారే ఉన్నారు. వారిని పదవి నుంచి తప్పించాలంటే మరో ఆరు నెలలు వేచి ఉండాలి. ఒకవేళ వారై పదవులకు రాజీనామా చేస్తే తెలుగుదేశం పార్టీవారికి అవకాశం వస్తుంది. అలా కుదరని పక్షంలో నాలుగేళ్లు పూర్తయ్యే వరకు తొలగించడానికి ఆస్కారం లేదని అధికారులు చెబుతున్నారు. అయినా ఆఖరి ఏడాదైనా టీడీపీవారు వైస్ చైర్మన్‌గా ఉండాలనుకుంటున్నారు. ఇప్పటికే మొదట టీడీపీలో గెలిచిన ఆరుగురు సభ్యుల్లో ఒకరు చైర్మన్ కాబోతుండగా మరో ఐదుగురు ఉన్నారు. వారిలో ఇద్దరు కౌన్సిలర్లు వైస్ చైర్మన్ కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. కానీ అన్నీ సజావుగా జరిగితే వైసీపీ నుంచి వచ్చిన వారికి ఒకరికి, టీడీపీ కానీ లేదా కూటమి పార్టీలో ఉన్న ఒకరికి వైస్‌చైర్మన్ దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

రేపటి నుంచే బదిలీల జాతర

నచ్చిన చోటు కోసం ముమ్మర ప్రయత్నాలు

కూటమి నాయకుల చుట్టూ కొందరు అధికారులు



పుట్టపర్తి,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కొలువు తీరినప్పటి నుంచి కొంత మంది అధికారులు నచ్చిన చోటుకు పోస్టింగ్ కోసం పైరవీలు చేసుకుంటున్నారు. ఇప్పటికే పోలీస్, రెవెన్యూ అధికారులు నచ్చిన ప్రాంతాల్లో కొలువుదీరారు. ఇప్పుడు సాధారణ బదిలీల వంతు వచ్చింది. ఉద్యోగుల బదిలీపై ఉన్న నిషేధాన్ని ఈనెల 19 నుంచి నెలాఖరు దాకా నడలిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనేపథ్యంలో జిల్లాలో వివిధ శాఖల్లో బదిలీల సందడి ప్రారంభమైంది. సోమవారం నుంచి బదిలీల జాతర మొదలవనుంది. జిల్లా స్థాయి అధికారులతోపాటు ఆయాశాఖల్లో సూపరింటెండెంట్లు సీనియర్, జూనియర్ అసిసెంట్లు, క్లాస్-4 ఉద్యోగులు బదిలీ కానున్నారు. సాధారణ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ రావడంతో ప్రాధాన్య ప్రాంతాల్లో సిఫార్సులతో పాగా వేసేందుకు కొందరు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

మార్గదర్శకాలివే ...

సాధారణ ఉద్యోగుల బదిలీల్లో విధివిధానాలను సాధారణ పరిపాలనా శాఖ ఖరారు చేసింది. ఒకే స్టేషన్‌లో 2024 జూలై నాటికి ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలి. ఇతర ఉద్యోగులం తా కూడా పరిపాలన సౌలభ్యం దృష్ట్యా బదిలీలకు అర్హులే. ఒకే స్టేషన్ అంటే జిల్లాలో ఏ హోదాలో ఐదేళ్లుగా కొనసాగుతున్నా బదిలీ చేయాల్సిందే. దృష్టిలోపం ఉన్న ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ల కంటే ఎక్కువ కాలం విధులు నిర్వహిస్తున్న వారికి కూడా ప్రాధాన్యం ఇస్తారు. 40శాతం అంతకంటే ఎక్కువ దివ్యాంగత్వం ఉన్న వారికి, విభిన్న ప్రతిభావంతులైన పిల్లలున్న వారికి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యం ఉంటుంది. మెడికల్ గ్రౌండ్స్‌పైనా బదిలీలకు ప్రాధాన్యం ఇస్తారు. వితంతువులు, దంపతులు ఒకే ఊరిలో పని చేసేందుకు అవకాశం కల్పిస్తారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్స్(అధ్యక్షులు, సెక్రెటరీ, ట్రెజరర్)కు బదిలీ నుంచి మినహాయింపు ఉంటుంది.

పోస్టింగ్‌ల కోసం పైరవీలు

సాధారణ బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఉద్యోగులు నచ్చిన చోటుకు పోస్టింగ్ కోసం పైరవీలు ప్రారంభించారు. 'సార్..! మీ మాట జవదాటం. మీరు ఎట్లా అంటే అట్లానే. ఒక్క లెటర్ మీరు ఇస్తే మీఇలాఖాలో పోస్టింగ్ తెచ్చుకుంటా' అని ప్రాధాన్య శాఖల్లో కొందరు అధికారులు, ఉద్యోగులు కూటమి నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రధానంగా రెవెన్యూ, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్, విద్యుత్ శాఖలతోపాటు మరికొన్నిశాఖల్లో ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలకు వెళ్లేందుకు సిఫార్సులతో ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం: ఎస్పీ

10వేల లీటర్ల మద్యం ధ్వంసం చేసిన సెబ్‌పోలీసులు


మద్యాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రత్న తదితరులు

పెనుకొండ రూరల్, ఆగస్టు 17: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. జిల్లాలో వివిధ కేసుల్లో పట్టుబడిన పదివేల లీటర్ల మద్యాన్ని శనివారం మధ్యాహ్నం పెనుకొండ సమీపంలోని మడకశిర రోడ్డులో ఎక్సాకవేటర్‌తో ధ్వంసం చేయించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వి. రత్న, ఏఎస్పీ విష్ణు, సెబ్ ఈఎస్ సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పది నెలల వ్యవధిలోనే సెబ్, పోలీస్ స్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యం కేసులు 1085, నాటుసారా కేసులు 35, బెల్ట్‌షాపు మద్యం కేసులు 297 మొత్తం 1417కేసులు నమోదైనట్లు తెలిపారు. సుమారు 10వేల లీటర్ల మద్యం విలువ రూ.68లక్షలు ఉంటుందన్నారు. జిల్లాలో నాటుసారా, అక్రమ మద్యం నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. అక్రమ ఇసుక, గంజాయి, పేకాట, మట్కాలాంటి కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. కార్యక్రమంలో పెనుకొండ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ యుగంధర్, సెబ్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రాజేష్, సెబ్ పోలీసులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


మద్యం ప్యాకెట్లను ధ్వంసం చేస్తున్న ఎక్స్‌కవేటర్

అనంత క్రీడాగ్రామంలో 5 నుంచి దులీప్‌ట్రోఫీ

పాల్గొననున్న భారతజట్టు కీలక ఆటగాళ్లు



దులీప్‌ట్రోఫీకి ఆతిథ్యమివ్వనున్న అనంత క్రీడాగ్రామం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 17: దులీప్‌ట్రోఫీ అనంతక్రీడాగ్రామంలోని ఆర్డీటీ స్టేడియంలో సెప్టెంబరు 5 నుంచి జరగనుంది. దిగ్గజ ఆటగాళ్లు ఈ ట్రోఫీలో పాల్గొననున్నారు. ఇండియా-ఏ, ఇండియా-బీ, ఇండియా-సీ, ఇండియా-డీ జట్ల మధ్య పోటీలు జరగనున్నాయి. జట్ల వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

ఇండియా ఏ జట్టు

శుభమన్‌గిల్ (కెప్టెన్), మయాంక్ అగర్వాల్, రియాన్‌పరాగ్, ధ్రువ్‌జురెల్, కేఎల్ రాహుల్, తిలక్‌వర్మ, శివందూబే, తనుష్‌కోటినా, కులదీప్ యాదవ్, ఆకాష్‌దీప్, ప్రసిద్ధ్‌కృష్ణ, ఖలీల్‌అహ్మద్, అవేష్‌ఖాన్, విద్వత్ కావేరప్ప, కుమార్ కుషగ్రా, శావత్ రావత్

ఇండియా బీ జట్టు

అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, రిషబ్‌పంత్, ముషీర్‌ఖాన్, నితీష్‌కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, రవీంద్రజడేజా, మహ్మద్‌సిరాజ్, యష్‌దయాల్, ముకేష్‌కుమార్, రాహుల్‌చహర్, సాయికిశోర్, మోహిత్‌అవాస్తి, జగదీషన్

ఇండియా సీ జట్టు

రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సాయి సుదర్శన్, రజత్ పటీదార్, అభిషేక్ పోరల్, సూర్యకుమార్ యాదవ్, బీ ఇంద్రజిత్, హృతిక్ షోకీన్, మానవ్ సుతార్, ఉమ్రాన్‌మాలిక్, వైశ్యక్ విజయ్‌కుమార్, అన్షుల్ కాంబోజ్, హిమాన్స్‌చౌహాన్, మయాంక్ మార్కండే, ఆర్యన్‌జుయల్, సందీప్ వారియర్

ఇండియా డీ జట్టు

శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), అతర్వతైడా, యష్‌దూబే, దేవ్‌దత్ పడిక్కల్, ఇసాన్‌కిషాన్, రిక్కీభాయ్, సరాన్స్‌జైన్, అక్షర్‌పటేల్, అర్షదీప్‌సింగ్, ఆదిత్యథాక్రే, హర్షిత్‌రాణా, తుషార్ దేశ్‌పాండే, ఆకాష్‌సేన్ గుప్తా, కేఎస్ భరత్, సౌరభ్‌కుమార్ ఉన్నారు. కాగా భారతజట్టులోని కీలక ఆటగాళ్లు వస్తుండటంతో అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియాన్ని ముస్తాబు చేస్తున్నట్లు క్రికెట్ సంఘ జిల్లా కార్యదర్శి మధుఆచారి తెలిపారు. అంతర్జాతీయ క్రీడాకారులు ప్రాతినిథ్యం వహించే మ్యాచ్‌లు కేటాయించడం జట్ల ఆర్డీటీ ప్రొగ్రామ్ డైరెక్టర్ మాంచోఫెర్రర్ సంతోషం వ్యక్తం చేశారు.

జడ్పీ సీఈఓ బాధ్యతల స్వీకరణ



ఓబుళమ్మ

అనంతపురం విద్య, ఆగస్టు 17: జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా ఓబుళమ్మ నియమితులయ్యారు. శనివారం సీఈఓ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను ఆమె బంగ్లాలో మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకు ముందు జిల్లాపరిషత్ ఉద్యోగులు, సిబ్బంది నూతన సీఈఓను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

21న ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

అనంతపురం టౌన్, ఆగస్టు 17: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం 21వ తేదీన ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు కలెక్టరు వినోద్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూభవన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్‌ఐల బదిలీ

అనంతపురం క్రైం, ఆగస్టు 17: జిల్లాలో ముగ్గురు ఎస్‌ఐల బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఎస్పీ కేవీ మురళీకృష్ణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని తాడిపత్రి రూరల్ పోలీస్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సాగర్‌ను నార్పలకు బదిలీ చేశారు. నార్పలలో పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డిని వీఆర్‌కు పంపారు. శ్రీ సత్యసాయి జిల్లాలో వీఆర్, ఎస్పీలో ఉన్న తులశన్నను అనంతపురం పోలీస్ కంట్రోల్ రూంకు బదిలీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 17: కలెక్టర్ ఆదేశాల మేరకు మాన్యువల్ స్కావెంజర్ల జిల్లా సర్వే కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇందులో నలుగురు సభ్యులు ఉంటారని, వారిలో మాన్యువల్ స్కావెంజర్స్ లేదా పారిశుధ్య కార్మికుల కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇద్దరు, మాన్యువల్ స్కావెంజర్స్ లేదా పారిశుధ్య కార్మికుల సంఘంలో ఇద్దరు ఉంటారన్నారు. వీరిలో ఒకరు మహిళా సభ్యురాలు ఉంటారన్నారు. ఆసక్తి గల వారు వివరాలతో 21వ తేదీలోపు జిల్లా కేంద్రంలోని దామోదరం సంజీవయ్య భవన్‌లోని ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 11 దరఖాస్తులు

అనంతపురం విద్య, ఆగస్టు 17: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అనంతపురం, గుత్తి డివిజన్ల నుంచి 11 దరఖాస్తులు వచ్చాయి. గుత్తి డివిజన్ నుంచి 8, అనంతపురం డివిజన్ నుంచి ముగ్గురు దరఖాస్తు చేశారు. స్కూల్ అసిస్టెంట్ తెలుగు టీచర్-1, ఇంగ్లీష్ టీచర్లు-4, ఫిజికల్ సైన్స్ టీచర్-1, సోషల్ టీచర్-1, ఎస్ఏ (వ్యాయామ విద్య)-1, సెకండరీ గ్రేడ్ టీచర్ల నుంచి రెండు, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు-1 దరఖాస్తులు వచ్చాయి. వీటినిపై జిల్లా ఎంపిక కమిటీ సభ్యులు పరిశీలిన చేస్తున్నట్లు విద్యాశాఖాధికారుల ద్వారా తెలుస్తోంది.

పుట్టపర్తికి పౌరవిమానయాన సేవలు

సీఎం చంద్రబాబుతో చర్చించిన కేంద్రమంత్రి



పుట్టపర్తి విమానాశ్రయం రన్‌వే

పుట్టపర్తి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలో సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విమానాశ్రయాన్ని పబ్లిక్ ఎయిర్ పోర్టుగా మార్చి పౌరవిమానాశ్రయ సేవలు ఎలా ప్రారంభించాలన్న విషయమై చర్చించామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో విమానాశ్రయాల అభివృద్ధి, ప్రధాన నగరాలతో ఎయిర్ కనెక్టివిటీ వంటి అంశాలపై ఢిల్లీలో కేంద్ర పౌరవిమానయాన శాఖ కార్యాలయంలో సీఎం చంద్రబాబుతో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు చర్చించారు. అనంతరం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రైవేట్ ఆర్గనైజేషన్‌లో ఉన్న పుట్టపర్తి సత్యసాయి బాబా విమానాశ్రయాన్ని రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రజా ఎయిర్ పోర్టుగా తయారు చేయగలితే ఆప్రాంతానికి రెగ్యులర్ విమానాల రాకపోకలు సాధ్యమవుతాయన్నారు. పుట్టపర్తి సత్యసాయి ఎయిర్ పోర్టును పౌర విమానాశ్రయంగా చేయాలన్న దిశలో చర్చలు నడుస్తుండటంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సార్..! మమ్మల్ని తీసుకెళ్లండి

- వ్యవసాయ శాఖ ఎంపీఈఓల వేడుకోలు
- ఓడీపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పని చేస్తున్న చిరుద్యోగులు
- సచివాలయ వ్యవస్థ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం శ్రీకారం
- అంతకుముందే అనంతకు తీసుకెళ్లాలని విన్నపం
- కూటమి ప్రభుత్వంలోనైనా ఊరట లభించేనా?



రైతు సేవా కేంద్రం

అనంతపురం అర్బన్, ఆగస్టు 17: కూటమి ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరగకపోతుందా అని పలువురు వ్యవసాయశాఖ ఎంపీఈఓలు ఎదురు చూస్తున్నారు. నూతన ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను క్రమబద్ధీకరించాలని భావిస్తున్న నేపథ్యంలో తమను పరిగణనలోకి తీసుకుని ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఉమ్మడి అనంత జిల్లాకు తీసుకురావాలని ఎంపీఈఓలు కోరుతున్నారు.

ఓడీపై చిత్తూరులో విధులు

టీడీపీ పాలనలో 2015 సంవత్సరంలో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఉమ్మడి జిల్లాలో 650 మంది ఎంపీఈఓలను (మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్) కాంట్రాక్టు పద్ధతిలో ఎంపిక చేశారు. అప్పట్లో 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓను నియమించారు. వీరంతా వ్యవసాయ శాఖ శాఖ తరపున క్షేత్ర స్థాయిలో పనిచేస్తూ వచ్చారు. అయితే వైసీపీ సర్కార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశు సంవర్ధక శాఖ తరపున గ్రామ స్థాయి సిబ్బందిని నియమించింది. దీంతో ఎంపీఈఓలకు కష్టకాలం మొదలైంది. గతంలో ఉమ్మడి జిల్లాలో 650 మంది ఎంపీఈఓలు పనిచేసేవారు. వీరిలో 175 మంది వీఏఏ పోస్టులకు ఎంపికయ్యారు. మిగలినవారు అలాగే ఉండిపోయారు. జనాభా ప్రాతిపకదిగా పోస్టులు కేటాయించడంతో ఇక్కడ ఖాళీ పోస్టులు లేవన్న కారణంతో 2020లో 205 మంది ఎంపీఈఓలను ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపారు. ప్రస్తుతం వీరిలో 115 మంది ఉమ్మడి చిత్తూరులో పనిచేస్తున్నారు. మిగిలిన వారిలో అనారోగ్యం, ప్రసూతి సెలవులు, ఆర్థిక, కుటుంబ పరమైన సమస్యలతో ఓడీపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేయలేక తిరిగి వచ్చారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే తమకు న్యాయం చేస్తారన్న ఆశతో ఎంపీఈఓల సంఘం నాయకులు, ఎంపీఈఓలు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, స్థానిక ఎమ్మెల్యేలకు తమను సొంత జిల్లాకు రప్పించడంతోపాటు తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఎంపీఈఓలను జిల్లాకు రప్పించడంపై అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఇటీవల జడ్పీ సర్వసభ్య సమావేశంలోనూ ప్రస్తావించారు. తాజాగా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను క్రమబద్ధీకరించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరులో పనిచేస్తున్న ఎంపీఈఓల్లో గుబులు మొదలైంది. క్రమబద్ధీకరణకు ముందే తమను అనంత జిల్లాకు తిరిగి రప్పించి, రైతు సేవా కేంద్రం సిబ్బందితోపాటు తమకు జిల్లాలో స్థానాలు కేటాయించాలని ఆయా ఎంపీఈఓలు కోరుతున్నారు.

సిబ్బందిని జిల్లాకు రప్పించేందుకు గత నెలలో లేఖ

ఓడీపై చిత్తూరు జిల్లాకు సిబ్బందిని పంపకుండా జిల్లాలోనే కొనసాగించాలని ఎంపీఈఓల సంఘం నాయకులు అప్పటి ప్రజాప్రతినిధులకు అనేక సార్లు విన్నవించారు. ఉమ్మడి అనంత జిల్లాలో 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓ పోస్టును కేటాయిస్తే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. అయితే వారి ఆవేదనను ఎవరూ పట్టించుకోలేదు. గత నెల రెండో వారంలో జిల్లా వ్యవ సాయ శాఖ కార్యాలయం నుంచి ఓడీపై చిత్తూరులో పనిచేస్తున్న ఎంపీఈఓ లను తిరిగి జిల్లాకు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు లేఖ పంపారు. తద్వారా జిల్లాలో ఈ పంట నమోదు, ఇతర రకాల పనులు సకాలంలో పూర్తి చేయడంతోపాటు రైతులకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం ఉందని అందులో పేర్కొన్నారు. ఆ లేఖ పంపే సమయానికి వ్యవసాయ శాఖ కమిషనర్‌గా హరికిరణ్ ఉన్నారు. గత నెల మూడో వారంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా ఢిల్లీరావు బాధ్యతలు చేపట్టారు. ఎంపీఈఓలను తిరిగి జిల్లాకు రప్పించేందుకు ఇక్కడి నుంచి పంపిన ఫైల్ విషయాన్ని కమిషనరేట్ కార్యాలయ ఉన్నతాధికారులు కొత్త డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లలేదని తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదని సమాచారం.

టెర్మినేట్ చేసిన సిబ్బంది సంగతేంటో..?

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై వెళ్లలేదన్న కారణంతో 50 మంది ఎంపీఈఓలను జిల్లా వ్యవసాయ యంత్రాంగం ఉద్యోగం నుంచి నిర్దాక్షిణ్యంగా తొలగించింది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ కొందరు ఎంపీఈఓలు ఓడీపై ఇతర జిల్లాలకు వెళ్లలేకపోయారు. అయితే ఆయా జిల్లాల్లో ఎవరినీ ఉద్యోగం నుంచి టెర్మినేట్ చేయలేదు. ఎప్పటికైనా సొంత జిల్లాలో పోస్టింగ్‌లు ఇవ్వకపోతారా..? అనే కారణంతో ఆయా జిల్లాల ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకోనట్లు తెలిసింది. అనంత జిల్లాలో ఓడీపై వెళ్లని సిబ్బందిని టర్మినేట్ చేయడంతో వారికి తీవ్ర అన్యాయం జరిగింది.

క్రమబద్ధీకరణకు ముందే జిల్లాకు రప్పించాలి



సచివాలయ వ్యవస్థ క్రమబద్ధీకరణకు ముందే ఓడిపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓలను తిరిగి జిల్లాకు రప్పించాలి. రైతు సేవా కేంద్రం సిబ్బందితోపాటు మాకు జిల్లాలో స్థానాలు కేటాయించాలి. ఓడీపై ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందితోపాటు టెర్మినేట్ చేసిన సిబ్బందికి తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలి. ఈ ఏడాది మార్చి నెలలో ఎంపీఈఓల సర్వీస్ రెన్యువల్ చేయాల్సి ఉండగా ఇప్పటి దాకా పెండింగ్‌లో ఉంది. గత నాలుగు మాసాలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకొని న్యాయం చేయాలి.

- రెడ్డి ప్రసాద్, ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు

అవసరం లేకున్నా ఓడీపై పంపారు



వైసీపీ హయాంలో అవసరం లేకుండానే జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓలను ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపారు. అప్పటి నుంచి అనేక సార్లు అప్పటి ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మాకు న్యాయం చేస్తుందన్న నమ్మకం ఉంది. తక్షణమే ఓడీపై చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓలను జిల్లాకు రప్పించేలా చర్యలు తీసుకోవాలి. రైతు సేవా కేంద్రం సిబ్బంది చేసే పనులు మేము చేస్తున్నాం. వారితో సమానంగా వేతనాలు అందించి ఆదుకోవాలి.

- శంకర్, ఎంపీఈఓల సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు

బదిలీల ఫీవర్

- డీపీఓ ప్రభాకర్‌రావు బదిలీ తథ్యం..?
- ఆ స్థానంలో సూర్యనారాయణకు అవకాశం..?
- పంచాయతీల్లో బదిలీల కోసం సిబ్బంది పైరవీలు



డీపీఓ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 17: జిల్లా పంచాయతీలో బదిలీల ఫీవర్ పట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పైరవీల ప్రక్రియ తారస్థాయికి చేరింది. ప్రస్తుత జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు బదిలీ తథ్యమన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇక్కడి నుంచి వెళ్లడానికి ఆయన కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం రాష్ట్ర శాఖ కార్యాలయానికి వెళ్లిన ఆయన.. రాయలసీమలోని ఉమ్మడి అనంతపురం జిల్లా మినహా వేరే జిల్లాకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఎక్కువ శాతం చిత్తూరుకు బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రభాకర్‌రావు బదిలీపై వెళితే ఆ స్థానంలో డీపీఓగా రావడానికి కదిరి డీఎల్‌డీఓగా పనిచేస్తున్న మునుపటి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సూర్యనారాయణ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. జిల్లాకు చెందిన ఆర్థిక మంత్రి మాత్రం ఇంకా ఏమీ తేల్చనట్లు సమాచారం. ఆయన కూడా గ్రీన్ సిగ్నల్ ఇస్తే సూర్యనారాయణ డీపీఓగా తథ్యమన్న చర్చ జరుగుతోంది. డీఎల్‌పీఓల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. జిల్లా విభజన అనంతరం జిల్లా కేంద్రం డీఎల్‌పీఓ మినహా మిగిలిన కళ్యాణదుర్గం, గుంతకల్లు రెండు డివిజన్లు ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓలతోనే పాలన నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం గుంతకల్లుకు పెద్దవడుగూరు ఈఓఆర్డీ నాగేశ్వరశాస్త్రి ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓగా ఉన్నారు. కళ్యాణదుర్గానికి బ్రహ్మసముద్రం ఈఓఆర్డీ వెంకటనాయుడు ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓగా ఉన్నారు. వీరిద్దరు కూడా జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న మండల విస్తీర్ణాధికారులుగా వెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. రెగ్యులర్ డీఎల్‌పీఓ ఎప్పుడు వస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. అనంతపురం డీఎల్‌పీఓగా ఉన్న సుమన జయంతి కూడా బదిలీ ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. జిల్లా పంచాయతీ కార్యాలయంలో పరిపాలనా అధికారిగా ఉన్న విశ్వనాథరెడ్డి బదిలీ తథ్యమన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. గతంలో కడపలో పని చేసిన ఆయన ప్రస్తుతం అక్కడికే వెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఆయన బదిలీపై వెళితే శ్రీసత్యసాయి జిల్లా డీపీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఏఓ ఇక్కడికి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. జిల్లా పంచాయతీ కార్యాలయంలో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. వీరిలో ఇద్దరికి ఐదు సంవత్సరాలు పూర్తయ్యాయి. దీంతో వారికి బదిలీ తప్పదని తెలుస్తోంది. ఇందులో ఒకరు ఇప్పటికే స్థానికంగా ఓ ప్రజాప్రతినిధి వద్ద పీఏగా చేరారు. మరో సీనియర్ అసిస్టెంట్‌ను పెనుకొండకు బదిలీ చేస్తారా..? లేదా పుట్టపర్తి డీపీఓ కార్యాలయానికి మారుస్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇక్కడికి సీనియర్ అసిస్టెంట్లు లీలాబాయి, ఉషా వచ్చే అవకాశం ఉంది. డీపీఓ బదిలీ కాకపోతే కార్యదర్శుల బదిలీలు సాధ్యం కావు. స్థానిక ప్రజాప్రతినిధుల సమ్మతితో వారికి కావాల్సిన పంచాయతీల్లో పాగా వేయడానికి కొందరు కార్యదర్శులు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. గత మూడేళ్లుగా ఉన్నతాధికారి అండదండలతో అధికారం చలాయించిన వారు ప్రభుత్వం మారడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్న చర్చ జరుగుతోంది. ఏ అధికారి వచ్చినా స్థానిక ప్రజాప్రతినిధుల సమ్మతితో అనంతపురం రూరల్‌లో పలు పంచాయతీలకు కర్చీఫ్ వేసుకొని కొందరు కార్యదర్శులు ఎదురు చూస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

15 శాఖలకు అవకాశం... 31లోగా పూర్తికి గడువు

అనంతపురం టౌన్, ఆగస్టు 17: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీలకు ఆమోదం తెలుపుతూ శనివారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. 15 శాఖల బదిలీలకు మాత్రమే అవకాశం కల్పించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, రూరల్‌డెవలప్‌మెంట్, మునిసిపల్, పౌరసరఫరాలు, మైనింగ్, జియోలజీ అన్నిశాఖల్లో ఇంజనీరింగ్ విభాగాలు, దేవదాయ, రవాణా, పరిశ్రమలు, విద్యుత్‌శాఖ, రిజిస్ట్రేషన్, కమర్షియల్, ఎక్సైజ్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలతోపాటు గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీలో అవకాశం కల్పించారు. సోమవారం నుంచి బదిలీలు మొదలు పెట్టి 31వతేదీలోగానే బదిలీల ప్రక్రియ ముగించాలని ప్రభుత్వం గడువు విధించింది. నిబంధనల మేరకు ఐదేళ్లు ఒకచోట పనిచేసినవారు తప్పనిసరిగా బదిలీకావాల్సి ఉంటుంది. అంతకన్నాలోపు సర్వీస్ ఉన్నవారురిక్వెస్ట్ పెట్టుకుంటే బదిలీ చేస్తారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 17: రూడ్‌సెట్ సంస్థలో స్వయం ఉపాధి కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. పురుషులకు కంప్యూటర్, ట్యాలీ, ఏసీ, ఫ్రిజ్ రిపేరీల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఉచిత శిక్షణతోపాటు భోజన, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు, పురుషులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు పేర్ల నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ నంబర్లు 9618876060, 9440905479లను సంప్రదించాలని కోరారు.

జీడిపల్లి రిజర్వాయర్‌కు పెరుగుతున్న నీటి మట్టం

బెళుగుప్ప, ఆగస్టు 17: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో ఎక్కువగా వుండటంతో నీటి మట్టం పెరుగుతోంది. ప్రస్తుతం 0.543 టీఎంసీలు నీటి నిల్వ వుండి శనివారం 0.921 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోతే వేతనాల్లో కోత..!

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు



మాట్లాడుతున్న సీఎండీ సంతోష్‌రావు

అనంతపురం రూరల్, ఆగస్టు 17: ట్రాన్స్‌ఫార్మర్స్ చెడిపోతే సంబంధిత సెక్షన్ అధికారులు, ఉద్యోగుల వేతనాల్లో కోతలు ఉంటాయని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు జిల్లా విద్యుత్ అధికారులను హెచ్చరించారు. శనివారం జేఎన్‌టీయూరోడ్డులోని విద్యుత్‌శాఖ ప్రధానకార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఆ శాఖ రెవెన్యూ సీజీఎం ధర్మజ్ఞాని, ఎస్‌ఈ సంపత్‌కుమార్‌తో కలసి ఉమ్మడి జిల్లా విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విద్యుత్ అంతరాయాలు తగ్గించాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆదేశించారు. విద్యుత్‌లైన్లు టిమ్ చేసుకోవాలని సూచించారు. ప్రీమాన్‌సూన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవాటిని యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ లోడ్ అధిగమించేందుకు కొత్త లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లు త్వరిగతిన రిలీజ్ చేయాలన్నారు. సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌పై కరపత్రాలు పంపిణీ చేయించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లు, బకాయిలు త్వరితగతిన వసూలు చేయాలని ఆదేశించారు.

అవినీతి వెలుగు

- వైసీపీ హయాంలో రూ.2 కోట్లు దోచేశారు
- వ్యవహారం బయటకు పొక్కనివ్వని సిబ్బంది
- కూటమికి అధికారంతో అక్రమార్కుల్లో గుబులు



కళ్యాణదుర్గం, ఆగస్టు 17: వైసీపీ హయాంలో కళ్యాణదుర్గం వెలుగు కార్యాలయంలో అవినీతి ఒక్క వెలుగు వెలిగింది. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. దాదాపు రూ. రెండు కోట్ల స్త్రీ నిధి సొమ్మును స్వాహా చేశారు. మహిళలు స్వయం ఉపాధి కోసం ఆర్థికంగా నిలదొక్కుకొనేందుకు స్త్రీ నిధి సొమ్మును మహిళా సంఘాల సభ్యులకు మంజూరు చేస్తారు. వెలుగు ఏపీఎం, సీసీ సంతకాలు చేసిన తర్వాత స్త్రీ నిధి సొమ్ము మహిళా సంఘాల సభ్యుల ఖాతాల్లో జమ అవుతుంది. అయితే ఏపీఎం, సీసీ అనుమతులు పొందిన తర్వాత ఆ సొమ్ము మహిళా సంఘాల సభ్యుల ఖాతాల్లో జమకాకుండా.. వైసీపీ నాయకులు ఖాతాల్లో జమ అయింది. వైసీపీ హయాంలోనే ఇలా కళ్యాణదుర్గం మండలం హులికల్లు, మల్లికార్జునపల్లిలో స్త్రీ నిధి సొమ్ము స్వాహా అయింది. బ్యాంకుల వద్దకు వెళ్లి మహిళల అకౌంట్‌ను పరిశీలించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అయితే అవినీతికిపాల్పడిన వారు వైసీపీకి చెందిన వారు కావడంతో వారి జోలికి వెళ్లవద్దని ఆ పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారు. దీంతో ఆ అధికారులు నాడు మిన్నకుండిపోయారు. ఆ గ్రామాల వైపు కనీసం కన్నెత్తి చూడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ అవినీతిని వెలికి తీయాలని ఆ గ్రామాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు ఒత్తిడి చేశారు. దీంతో ఇప్పుడు ఆ గ్రామాల్లో అవినీతిని వెలికితీయడానికి వెలుగు అధికారులు పరుగులు తీస్తున్నారు. వెలుగు కార్యాలయంలోనే ఈ అవినీతి ఆజ్యం పోసినట్లు తెలుస్తోంది. వెలుగు కార్యాలయంలో పనిచేసే అధికారులు, ఆ బ్యాంక్ ఉద్యోగి ఒక్కటై స్త్రీ నిధి సొమ్మును డ్రా చేశారనే ఆరోపణలున్నాయి. ఇంత అవినీతి జరిగినా.. నాడు పనిచేసిన వెలుగు ఏపీఎం, సీసీలు ఏమి చేశారో తెలియని పరిస్థితి. వారి తీరు అనుమానాలకు తావిస్తోంది. స్త్రీ నిధి సొమ్ముతో వైసీపీ నాయకులు, వెలుగు అధికారులు జేబులు నింపుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ఈ రెండు గ్రామాల్లోనే కాదు.. మండలంలో చాలాచోట్ల ఇలాంటి అవినీతే బహిర్గతం అవుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రశ్నించే వారే ఉండరనే ధీమాతో అక్రమార్కులు అందినకాడికి దోచుకున్నారు. నాడు వైసీపీ నాయకులు చెప్పినట్లు చేసినప్పటికీ, ఇప్పుడు అధికారుల మెడకు చుట్టుకుంటోంది.

ఉద్యాన పథకాలపై రైతులకు అవగాహన కల్పించండి

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు

అనంతపురం అర్బన్, ఆగస్టు 17: ఉద్యాన పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు ఆదేశించారు. స్థానిక ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ ఏడాది జిల్లాకు ఎంఐడీహెచ్ పథకం కింద రూ.14.53 కోట్లు, ఆర్‌కేవీవై కింద రూ.1.29 కోట్లు, ఇతర పథకాలకు రూ.1.01 కోట్లు మొత్తం రూ.16.83 కోట్లు లక్ష్యంగా ప్రభుత్వం విధించిందన్నారు. ఆయా పథకాలకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకునేలా క్షేత్ర స్థాయిలో ప్రచారం చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులకు పూజలు



గరుడంపల్లిలో పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు

ధర్మవరం రూరల్, ఆగస్టు17: శ్రావణమాసం రెండో శనివారాన్ని పు రస్క రించుకుని పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో నాగుల చవితి పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఉపవాస దీక్షతో నాగులకట్ట వద్ద, పుట్టలో పాలుపోసి మొక్కులు తీర్చుకు న్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాల్లో శనివారం పూజలు



నంబులపూలకుంట, ఆగస్టు 17: శ్రావణ మాసం రెండో శనివారం సందర్భంగా మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే మూలవిరాట్లకు అభిషేకాలు, ఆకు పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ధనియాన్‌చెరువు, పెడబల్లి, గౌ కన పేట, మేకలచెరువు, ఎస్సీకుంట ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ఆకుపూజలో ధనియాన్‌చెరువు ఆంజనేయస్వామి

ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా మొరార్జీ యాదవ్ ఎంపిక



మొరార్జీ యాదవ్

కొత్తచెరువు, ఆగస్టు 17: రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు దేమకేతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మొరార్జీ యాదవ్‌ను నియమితులైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి శనివారం తెలిపారు. ఆయనను వ్యాయామ ఉపాధ్యా య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వ ర్యంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆయన స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) కార్యదర్శిగా రెండేళ్లు కొనసాగుతారన్నారు. ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల అభివృద్ధికి పనిచేస్తారని డీఈఓ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శివకుమార్, సురేష్‌కుమార్, కుమార్ రాజా, వెంకటేశు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేయించుకోండి : ఏఓ

తనకల్లు, ఆగస్టు 17: మండల వ్యాప్తంగా ఈ సంవత్సరం ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతులు స్థానిక రైతు సేవాకేంద్రాల ఉద్యోగుల ద్వారా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ శ్రీహరినాయక్ శనివారం తెలిపారు. రైతులు పట్టాదారుపాస్‌పుస్తకం, సెల్‌ఫోన్, ఆధార్ కార్డుతో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. తనకు ఫోన్‌కు చేసినా సందేహాలు తీరుస్తామని ఏఓ తెలిపారు.

సహకార సంఘం సభ్యులకు ఈకేవైసీ తప్పనిసరి

నల్లమాడ, ఆగస్టు 17: మండలకేంద్రంలోని సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులందరూ తప్పకుండా ఈకేవైసీ చేయించుకో వాలని సహకార సంఘం సీఈఓ కేశప్ప శనివారం ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. ఇప్పటినుంచి సహకార సంఘం ఆన్‌లైన్ అవుతుందని, ఈ కేవైసీ చేయించుకోని రైతులు ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్, రెండు ఫొటోలు, సెల్‌నెంబర్‌తో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలపాటిదిన్నెలో వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ నాగేంద్ర కుమార్

నల్లచెరువు, ఆగస్టు 17: శ్రావణ మాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం నల్లచెరువు ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది శనివారం పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం ఆవర ణంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరం వైద్యాధికారి కల్పన ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ డాక్టర్ నాగేంద్రకుమార్ పర్యవేక్షించి ఓపీ రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు ముస్తఫా, సూర్యనారాయణరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఇంట్లో సామగ్రి ధ్వంసం

నల్లచెరువు, ఆగస్టు 17: మండలంలోని కాయలవాండ్లపల్లిలో శనివారం సాయంత్రం ఉరుములు, మేరుపులతో కురిసిన వర్షం కురిసింది. ఈ సమయంలో పిడుగుపడి దాసరి ఆంజనేయులు అనే వ్యక్తి ఇంట్లో సామగ్రి ధ్వంసమైంది. పిడుగు పడిన సమయంలో ఆ కుటుంబ సభ్యులు పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంటి ఆవరణంలో ఉన్న వేపచెట్టు సమీపంలో పిడుగు పండడంతో ఇంట్లోని విద్యుత్ వైర్లు, ఫ్రిజ్, టీవీ కాలిపోయాయి. ఇంటికి తిరిగి వచ్చిన తరువాత ప్రమాదం జరిగిందని గుర్తించినట్లు వారు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు.


ఒప్పంద కార్మికుడికి విద్యుదాఘాతం

నల్లమాడ, ఆగస్టు 17: మండలంలోని కొత్తపల్లి తండా వద్ద శనివారం విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఒప్పందకార్మికుడు అరాఫత్ విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడినట్లు బంధువులు తెలిపారు. ఒప్పంద కార్మికుడు అరాఫత్ స్తంభమెక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ సరఫర అయింది. దీంతో విద్యుదాఘాతమై కింద పడ్డాడని తెలిపారు. అతడిని వెంటనే కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమచికిత్స అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరికి తరలించినట్లు చెప్పారు. విద్యుత్ ఏఈ, లైన్‌మన్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని బాధితుడి కుటుంబ సభ్యులు గౌస్‌పీరా, జౌలి బాబా పేర్కొన్నారు. ప్రమాదానికి కారణాలను పరిశీలించి బాధ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గాయపడిన అరాఫత్‌కు మెరుగైన వైద్యం అందించేలా విద్యుత్ అధికారులు చొరవ చూపాలన్నారు.

నేడు జిల్లా స్థాయి యోగాసన పోటీలు

హిందూపురం అర్బన్, ఆగస్టు 17: పట్టణ పరిధిలోని వివేకానంద యోగా థెరపీ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి యోగాసనాల పోటీలు నిర్వహించనున్నట్లు సత్యసాయి జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బదరి నారాయణ, కార్యదర్శి సుబ్బరాయుడులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఈవెంట్‌కు రూ. 100 ఎంట్రీ ఫీజు ఉంటుందన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. సబ్‌జూనియర్స్‌కు 10 నుంచి 14 సంవత్సరాల లోపు ఉండాలని, జూనియర్స్ 14 నుంచి 18 సంవత్సరాలు, సీనియర్స్‌గ్రూప్ 18 నుంచి 28, సీనియర్స్ గ్రూప్ ఏలో 25 నుంచి 35, సినియర్స్ గ్రూప్ బిలో 35 నుంచి 45, సీనియర్స్ గ్రూప్ సిలో 45 నుంచి నుంచి 55 ఏళ్ళ వయసు ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు 9640979130, సిలబస్ కొరకు 8374037960ను సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



నాగార్జున రెడ్డి(ఫైల్)

నార్పల, ఆగస్టు 17: మండలంలోని నడిమిదొడ్డి గ్రామంలో శనివారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై నాగార్జున రెడ్డి(32)అనే యువకుడు మృతి చెందాడు. నాగార్జున రెడ్డి తోట పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. ఇంట్లో ట్యాంక్‌లో నీరు అయిపోవడంతో మోటారు ఆన్ చేయడానికి స్విచ్ ముట్టుకోగానే విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితిలో వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమత్తం అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. నాగార్జునరెడ్డికి భార్య ఝాన్సీ కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపాడు.

డాక్టర్లను కాపాడండి

- బాధ్యులను కఠినంగా శిక్షించాలి
- వైద్యులు, సిబ్బంది డిమాండ్
- వైద్య సేవలు బంద్ చేసి భారీ ర్యాలీ



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ధర్మవరంరూరల్, ఆగస్టు17: పశ్చిమబెంగాల్ రాష్ట్రరాజధాని కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లు, వైద్య సిబ్బంది ధర్మవరంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఆల్‌ఇండియా మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుప త్రుల డాక్టర్లు, వైద్యసిబ్బంది వైద్య సేవలను బంద్‌చేసి, ధర్మవరం ప్రభుత్వాసుపత్రి నుంచి ప్లకార్డులు పట్టుకుని కళాజ్యోతిసర్కిల్, కాలేజ్‌సర్కిల్ మీదుగా ర్యాలీ సాగించారు. వైద్యులపై దాడులు పూర్తిగా నశించాలి, డాక్టర్లను కాపాడండి మిమ్మల్ని మేము కాపాడుతాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మెడికల్ అసోసియేషన్ ధర్మవరం శాఖ అధ్యక్షుడు జయకుమార్, తదితరులు మాట్లాడుతూ... వైద్యురాలి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ వాసుదేవరెడ్డి, కోశాధికారి మదన్‌మోహన్, మాజీ అధ్యక్షు డు ప్రసాద్‌రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి, డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియాసాల్మన్, డాక్టర్లు నజీర్, వెంకటేశులు, వైష్ణవి, అనిల్, వివేక్, విక్రమ్, అజయ్‌బాబు, సిస్టర్ నిర్మల, వెంకటరమణ, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: కోలకత్తలో ఘటనకు నిరసనగా శనివారం ఐఎంఏ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఏరియా ఆసుపత్రినుంచి టవర్‌క్లాక్, ఎంజీరోడ్డు, జీవిమాన్‌సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా ర్యాలీ కొనసాగింది. దుండగులను కఠినంగా శిక్షించాల న్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నాయకులు, ఆర్ఎంపీల అసోసియేషన్ నాయకులు, పట్టణంలోని ప్రైవేటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు: కోల్‌కతా ఘటనకు నిరసనగా శనివారం మండలపరిధిలోని కొక్కంటి క్రాస్‌లోప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కొక్కంటి వైద్యాధికారి లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు ఆధ్వర్యంలో వైద్య ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి, నాలుగురోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటుచేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో కొక్కంటి సీహెచ్‌సీ సిబ్బంది, ఆశాకార్యకర్తలు, ల్యాబ్ టెక్నిషియన్లు, ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

పుట్టపర్తిరూరల్ : కోల్‌కతా ఘటనపై జిల్లాకేంద్రంలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు ఓపీ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకుని వైద్యుల్లో మనోధైర్యాన్ని నింపాలన్నారు.



కదిరిలో వైద్యులు, సిబ్బంది ర్యాలీ



కొక్కంటిక్రాస్‌లో రోడ్డుపై నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

విద్యా కమిటీ చైర్మన్‌ల ఎన్నిక



కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

బత్తలపల్లి ఆగస్టు17: మండలకేంద్రంలోని మహత్మాగాంధీజ్యోతిరావ్ పూలే గురుకుల పాఠశాల కమిటీ చైర్మన్‌గా శివశేఖర్, వైస్‌చైర్మన్‌గా లక్ష్మీదేవి ఎన్నికైనట్లు ఎంఈఓ గోపాల్‌నాయక్ తెలిపారు. గురుకుల పాఠశాలలో శనివారం పాఠశాల అభివృద్ధి కమిటీ ఎన్నికలను అధికారులు నిర్వహించారు. తీవ్ర ఉత్కంఠ నడుమ ఎన్నికలు జరిగాయి. డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పాఠశాల కమిటీ చైర్మన్‌గా కూటమి మద్దతుదారులు శివశేఖర్ చైర్మన్‌గా, లక్ష్మీదేవి వైస్ చైర్మన్‌గా పోటీ చేశారు. ఎవరూ పోటీగా నిలబడక పోవడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంఈఓ ప్రకటించారు. వారిని అధికారులు, టీడీపీ నాయకులు అభినందించారు.



ధనియాన్‌చెరువులోని స్కూల్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

నంబులపూలకుంట, ఆగస్టు 17: మండలంలోని ధనియాన్‌చెరువు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు బోగాతిరెడ్డి తెలిపారు. చైర్మన్‌గా భారతి, వైఎస్ చైర్మన్‌గా స్వామినాథం ఎన్నికైనట్లు తెలిపారు. వారిని టీడీపీ ధనియాన్‌చెరువు నాయకులు పూలమాలతో సత్కరించారు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి మూలవిరాట్‌లు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 17: మండలంలోని చిన్నపల్లి లో నూతంగా నిర్మించిన ఆలయంలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను శనివారం ఘనంగా నిర్వహించారు. రెండురోజుల పాటు వివిధ అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం అన్నదానం చేశారు. సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయసహకారాలు అందిస్తానన్నారు. కాంగ్రెస్ నాయకుడు కేవీ శ్రీధర్, సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి పాల్గొన్నారు.

'వంతెన నిర్మాణానికి కృషి'

ధర్మవరం రూరల్, ఆగస్టు17: మండలంలోని పోతులనాగేపల్లి, కనంపల్లి మధ్య చిత్రావతి నదిపై వంతెన నిర్మాణానికి మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామని మంత్రి కార్యాలయ పీఏ హరీష్ తెలిపారు. మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పోతులనాగేపల్లి వద్ద చిత్రావతి నదిపై వర్షపునీరు ఉధృతంగా పారుతోంది. దీంతో కనంపల్లి వాసులు ధర్మవరం వచ్చేందుకు వీలులేకుండా పోయింది. మంత్రి కార్యాలయ సిబ్బంది శనివారం స్థానిక నాయకులతో కలిసి చిత్రావతి నది వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ గంగపూజ చేశారు. ఆయన వెంట కూటమి నాయకులు జింకాచంద్రశేఖర్, సాకే ఓబిలేసు, ఆదెప్ప, పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పల్లె ఉమ జయంతి



బుక్కపట్నంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

బుక్కపట్నం, ఆగస్టు 17: మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమ 64వ జయంతిని శనివారం బుక్కపట్నంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే



డ్యాన్సులు చేస్తున్న విద్యార్థినులు

ధర్మవరంరూరల్, ఆగస్టు17: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డేని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు పలు సినిమా పాటలకు డ్యాన్సులు వేసి సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థినులకు చదువే సమాజంలో గుర్తింపు ఇస్తుందన్నారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నతశిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం గతంలో పనిచేసిన ప్రిన్సిపాల్ జ్యోతిర్లతను, బాలుర జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతిని ఘనంగా సన్మానించారు. అనంతరం రెండో సంవత్సరం విద్యార్థినులు మొదటి సంవత్సరం విద్యార్థినులకు గులాబీపూలు అందజేసి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బండివేణుగోపాల్, కమిటీ సభ్యులు పల్లెం వేణుగోపాల్, అధ్యాపకులు సునీత, వనిత, పెద్దన్న, విద్యార్థినులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని మోటార్లు

చెరువునీళ్లే గతి



చెరువులో నీళ్లు తీసుకెళుతున్న ఎనుమలపల్లి ప్రజలు

పుట్టపర్తి, ఆగస్టు 17: తాగునీరు అందించే మోటార్లు కాలిపోతే మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో చెరువునీళ్లతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఎనుమలపల్లి గ్రామస్తులకు ఏర్పడింది. జిల్లాకేంద్ర పరిధిలోని ఎనుమలపల్లిలో అన్న క్యాంటిన్ వద్ద ఉన్న మోటారుకాలిపోయి నాలుగేళ్లు అయింది. 12వ వార్డులోని మోటారు కాలిపోయి 20రోజులైంది. మునిసిపల్ అధికారులు వాటి మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడంతో చెరువునీటితో సరిపెట్టు కోవాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. అసలే వర్షాకాలం, రక్షిత మంచినీరు లేకపోతే రోగా లబారిన పడతామనే భయం నెలకొందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోటార్ల మరమ్మతులు చేయించాలని, తద్వారా తమకు తాగునీరు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వామ్మో దుర్వాసన..!

- పేరుకున్న చెత్తాచెదారం, నిల్వ ఉన్న మురుగునీరు
- వెంటనే శుభ్రం చేయించాలని ప్రజల విన్నపం



జట్కాస్టాండ్ వద్ద చెత్తాచెదారంతో నిండిపోయిన రహదారి

ధర్మవరంరూరల్, ఆగస్టు17: పట్టణం నడిబొడ్డున ప్రధాన కూడలిలో ఉన్న జట్కాస్టాండ్ వద్ద చెత్తాచెదారం పేరుకుపోయింది. మురుగునీరు అక్కడే నిలిచింది. దీంతో పూర్తి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. అక్కడి నుంచి వచ్చే భరించలేని దుర్వాసనతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ప్రధాన రహదారి కావడంతో దుకాణాలు పక్కనే ఉన్నాయి. ఎంతోమంది ప్రజలు రోజూ వచ్చిపోతుంటారు. అలాంటి రహదారిలో చెత్తాచెదారం, కుళ్లిపోయిన పండ్లు అక్కడే పడివేయడంతో దుర్వాసనతో ముక్కుమూసుకుని పోయే పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. ఆ ప్రాంతానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి చెత్తాచెదారాన్ని శుభ్రం చేయాలని, దుర్వాసన వెదజల్ల కుండా బ్లీచింగ్ చల్లాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి



వీడియోకాన్ఫరెన్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, ఆగస్టు 17: వచ్చే ఏడాదికి 15శాతం వృద్ధి సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్సు ద్వారా ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్‌లు, ఈఓపీఆర్డీలతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వికసిత ఆంధ్ర 2047 జిల్లా యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వచ్చే యేడాదిలో 15శాతం అభివృద్ధి సాధించేదిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నీతిఅయోగ్ సహకారంతో నిర్దేశిత లక్ష్యాలను నిర్ణయించుకుని అన్ని ప్రాథమిక రంగాల్లో అభివృద్ధికి వందరోజుల సంవత్సర ప్రణాళికలను తయారుచేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, సచివాలయ నోడల్ అధికారి శివారెడ్డి, పరిశ్రమలశాఖ జీఎం చాంద్‌బాషా పాల్గొన్నారు.

తాడిమర్రిలో 76.8 మి.మీ. వర్షపాతం



పీబీసీ కాలువలో సీబీఆర్‌కు వెళుతున్న నీరు

తాడిమర్రి, ఆగస్టు17: మండలంలోని రైతుల నీటి కరువుతీరేలా శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటివరకు మండలంలో చెప్పుకోతగ్గ వర్షం లేదు. దీంతో రైతులు వర్షం కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. చిల్లవారిపల్లి, రామాపురం,శివంపల్లి, కునుకుంట్ల, ఏకపాదంపల్లిల్లో తాగు, సాగునీరు కోసం ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం రాత్రి భారీగా వర్షం కురవడంతో వంకల్లో నీరు ప్రవహించింది. మండలంలో నీటి కరువు తీరిందంటూ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా కేంద్రాన్ని మార్చడానికి వీల్లేదు

టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి తలమర్ల మారుతిరెడ్డి

పుట్టపర్తి, ఆగస్టు 17: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రాన్ని హిందూపురానికి మార్చడం ఏమాత్రం సరికాదని టీడీపీ నియోజవర్గ అధికార ప్రతినిధి తలమర్ల మారుతిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రాన్ని హిందూపురానికి మార్చాలన్న ఎమ్మెల్యే బాలకృష్ణ నిర్ణయం సరికాదన్నారు. పరిపాలన పరంగా పుట్టపర్తిలో అన్ని వసతులు ఉన్నాయని జిల్లా ప్రకటన సందర్భంలో లేని అభ్యంతరం ఇప్పుడెందుకొచ్చిందని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర రాజధానిగా ఉన్న అమరావతిని మార్చి విశాఖను రాజధానిగా చేస్తానన్న నిర్ణయాన్ని బాలకృష్ణ వ్యతిరేకించారన్నారు. అలాంటి నిర్ణయమే ఇది అన్నారు. దీనిపై ప్రజాప్రతినిధులందరూ స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

'కన్నయ్యనాయుడికి ధన్యవాదాలు'

తాడిమర్రి, ఆగస్టు17: తుంగభద్ర జలాశయం నీరు వృథా కాకుండా స్టాప్‌లాగ్‌లు ఏర్పాటుచేయడంలో ప్రముఖ పాత్ర పోషించిన ఇంజనీరింగ్ నిపుణుడు కన్నయ్యనాయుడికి, అధికారులకు రాయలసీమ ప్రజలు రుణపడి ఉంటారని సర్పంచ్‌ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, రాష్ట్ర కార్యదర్శి ముత్యాలప్పనాయుడు అన్నారు. వారు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇది ఇంజనీరింగ్‌చరిత్రలోనే అద్భుతమని అన్నారు.

గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి



గో పూజ చేస్తున్న దృశ్యం

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 17: గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి జరుగుతుందని ఆర్ఎస్ఎస్ దక్షిణమధ్య క్షేత్ర శ్రీరామ్‌భరత్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని సున్నంపల్లిలో శనివారం గ్రామ వికాస్‌వర్గ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై, మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసే రైతులు రోజురోజుకు తగ్గిపోతున్నారన్నారు. దీంతో గ్రామాల్లో గోవులు పూర్తిగా కనుమరగవుతున్నాయన్నారు. వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.గ్రామవికాస్ రాష్ట్ర సంయోజకులు తిరుపతయ్య, సున్నంపల్లి చంద్ర, కిసాన్‌మోర్చా ఆర్గానిక్ రాష్ట్ర కన్వీనర్ చింతా కుమార్‌రెడ్డి, జిల్లా నాయకులు దేవరాజు, సుబ్బరాజు, రంగప్ప, ప్రసాద్, రామమోహన్‌రెడ్డి, సురేష్; హరి, ఆర్ఎస్ఎస్ లక్ష్మణ్, ప్రతాప్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు క్రీడా పరికరాల అందజేత



పీడీలకు క్రీడాపరికరాలు అందజేస్తున్న పీఆర్‌డీఎస్ సిబ్బంది

కొత్తచెరువు, ఆగస్టు 17: పీఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 16 పాఠశాలలకు సాయిభక్తురాలు ఏంజెలాడిక్సన్ సహకారంతో క్రీడా పరికరాలను పంపిణీ చేసినట్లు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర పాఠశాలలో శనివారం కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల్లోని 16 జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలకు క్రీడాపరికరాలు అందించారు. ఒక్కొక్క కిట్టు విలువ రూ. 15వేలని, ఆయా పాఠశాలలకు పీడీలకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏంజెలాడిక్సన్, పీడీలు ప్రబాకర్, రామకృష్ణ, వెంకటేశు, ప్రధానోపాధ్యాయురాలు వాణిబాయి, పీఆర్‌డీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీల్లో ఆడుతున్న క్రీడాకారులు

కదిరి అర్బన్, ఆగస్టు 17: పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో కందికుంట నారాయణమ్మ స్మారక 46వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. శనివారం జరిగిన పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల జట్లు పాల్గొన్నాయి. బాలుర లీగ్ పోటీల్లో విజయనగరం జట్టు 18-9 గోల్స్‌తో అనంతపురం జట్టుపై విజయం సాధించింది. విశాఖపట్నం జట్టు కడపజట్టుపై 14-7, నంద్యాలజట్టు 16-1 తేడాతో శ్రీకా కుళంపై, వెస్టు గోదావరి జట్టు 18-10 సత్యసాయిజిల్లాపై విజయం సాధించా యి. బాలికల విభాగంగాలో శ్రీకాకుళం 1-0 గోల్‌తో గుంటూరుపై , శ్రీకాకుళం 8-1 గోల్స్‌తో కర్నూల్ జట్టుపై గెలుపొందాయి. సత్యసాయి జిల్లా జట్టు 5-3తో నంద్యాలపై విజయం సాధించింది. పోటీల్లో ప్రతిభ కనబరచిన జట్లను క్రీడాకారులు అభినందించారు.


హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది


పరిగిలో..


పెనుకొండలో..

ఆగ్రహించిన వైద్యలోకం

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడి దారుణంగా హత్య చేయడంపై వైద్యసిబ్బంది ధ్వజమెత్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు ఏకమై భారీ ఆందోళనకు దిగారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు హిందూపురంలో ఐఎంఏ అధ్యక్షుడు నరసింహారెడ్డి అధ్యక్షతన విధులను బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. చిలమత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు. పరిగి వైద పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించి దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ తహసీల్దార్, పోలీస్ స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేశారు. గోరంట్లలో ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఫ్లకార్డులు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని అందరూ ధ్వజమెత్తారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు.


ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో


చిలమత్తూరులో..


గోరంట్లలో

వైద్యసేవలు బంద్

● రోగుల అవస్థలు ● గర్భిణులకు మరిన్ని కష్టాలు

హిందూపురం అర్బన్, ఆగస్టు 17: కలకత్తాలో వైద్య విద్యార్థిపై జరిగిన అత్యాచార ఘటనను నిరసిస్తూ వైద్య సేవలు నిలిపివేయడంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఓపీ సేవలను నిలిపివేసి అత్యవసర సేవలు మాత్రమే అందిస్తామని వైద్యులు ప్రకటించారు. అయితే కొందరు విషయం తెలియకుండా ఆస్పత్రికి వచ్చి గంటలకొద్దీ వేచి చూశారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లినా వైద్యులు లేకపోవడంతో దిక్కు తోచని పరిస్థితి నెలకొంది. గైనిక్ వార్డులో శుక్రవారం పరిగి మండలం శీగిపల్లికి చెందిన రూపావతి కాన్పుకోసం వచ్చారు, వైద్యులు పరిశీలించి అడ్మిట్ చేసుకున్నారు. శనివారం ఆపరేషన్ చేస్తామని, నీరు కూడా తాగవద్దని సూచించారు. ఆమె నీరసించి పోతుందని భర్త గైనిక్ వార్డులో నర్సుల ద్వారా వైద్యురాలికి తెలియజేసి ఆపరేషన్‌కు సిద్ధం చేశారు.


మూసేసిన ఓపీ గేట్లు


గర్భిణి రూపావతి


చెట్టు కింద కూర్చున్న రోగులు

వైభవంగా శ్రావణ శనివార పూజలు


బూదిలికాడిమాను ఆంజనేయస్వామి


లక్ష్మీపురం బాలాజీ ఆలయంలో


కోటలో నిజరూప ఆంజనేయుడిగా

హిందూపుంరం అర్బన్, ఆగస్టు 17: శ్రావణశనివారం పురస్కరించుకొని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని లక్ష్మీపురం బాలాజీ ఆలయం, పేట వెంకటేశ్వరాస్వామి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలో పూజలు నిర్వహించారు.

అగళి : రావుడి ఆంజనేయస్వామి, హెచ్‌డీ హళ్లి ఆంజనేయస్వామి, అగళి ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు.

గోరంట్ల : మండలంలోని ప్రధాన ఆలయాల్లో శ్రావణమాసం రెండవ శనివారం ప్రత్యేక పూజలునిర్వహించారు. బూదిలి గ్రామంలోని కాడిమానుఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక నిర్వహించారు.

పావగడ : పావగడ శనైశ్చరుడి ఆలయంలో భక్తలు పోటెత్తారు. శనిత్రయోదశి కావడంతో తైలాభిషేకాలు, నిర్వహించారు.


పావగడలో క్యూలైన్లో భక్తులు

పొదల్లోకి దూసుకెళ్లిన వాహనం

పెనుకొండ రూరల్, ఆగస్టు 17 : రొద్దం మండలంలోని పాతర్లపల్లి గ్రామసమీపంలో శనివారం మధ్యాహ్నం బొలెరో వాహనం అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి వెళ్లింది. అయితే ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటకలోని దావణగెరెకు చెందిన ఐదు మంది కుటుంబ సభ్యులు తిరుపతివెళ్లి వస్తున్నారు. తిరుగు ప్రయాణంలో పాతర్లపల్లికి రాగానే డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో వాహనం అదుపుతప్పి చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు హుటాహుటిన స్పందించి వారిని వాహనంలోంచి బయటకు తీసి కాపాడడంతో అందరూ క్షేమంగా తరలివెళ్లారు.


వాహనాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

విద్యార్థులకు ఆటలు నేర్పుదాం

హిందూపురం అర్బన్, ఆగస్టు 17: ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాంప్లెక్స్‌లో భాగంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నియోజకవర్గ సమావేశం శనివారం హిందూపురం ఎంజీఎం పాఠశాలలో ఇన్‌చార్జ్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన పీడీలు విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం ఆటలు నేర్పాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మురార్జీయాదవ్‌ను స్కూల్ గేమ్స్ ఫెడరేష్ జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఆయన్ని వ్యాయామ ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి మురార్జి యాదవ్, జిల్లా వ్యాయామ సంఘం అధ్యక్షుడు శివకుమార్, పీడి లోకనాథ్, ప్రసన్న లక్ష్మీ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బట్ర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతి

పెనుకొండ, ఆగస్టు 17 : బట్ర సామాజిక వర్గానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం నాయకులు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు శనివారం వినతిపత్రం అందించారు. పెనుకొండలో బట్ర సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు హనుమంతరాయుడు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస నాయుడు, రామాంజినేయులు, లక్ష్మీనారయణ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషిచేయాలని కోరారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోండి: ఏఓ

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 17 : మండలంలోని రైతులు తప్పనిసరిగా తమ పంటలను ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి శంకర్‌రెడ్డి సూచించారు. శనివారం గుడిపల్లి గ్రామ రైతులకు పంట నమోదుపై గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించారు. సస్యరక్షణ యాజమాన్య పద్ధతులను వివరించారు. ఖరీఫ్‌లో సాగుచేసిన కందిపంటలను వారంలోగా రైతు సేవా కేంద్రాల్ల నమోదు చేసుకోవాలని, అప్పుడే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ బాలకృష్ణ, గ్రామ కార్యదర్శి శివ, వ్యవసాయ, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన సదస్సు

పెనుకొండ రూరల్, ఆగస్టు 17 : పెయ్యి దూడలు పుట్టేలా తయారు చేయబడ్డ వీర్యంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. శనివారం రొద్దం మండలంలోని ఎల్. తిమ్మాపురంలో రైతులకు పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాడి రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించినట్లు పశుసంవర్ధకశాఖ జిల్లాకార్యనిర్వాహక అధికారి డా.సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టే దూడల్లో 90శాతం ఆడ దూడలు పుట్టేలా వీర్యాన్ని తయారుచేయడం జరిగిందన్నారు. ఇలాంటి వీర్యంపై రైతులకు అవగాహన కల్పించారు. రూ.1350 విలువ చేసే వీర్యాన్ని సబ్సిడీతో రూ.850కు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డా.వీపీ సుధాకర్, పశుగణాభివృద్ధి సంస్థ డా.శివశంకర్‌నాయక్, జాహ్నవి, పశువైద్యులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

అగళి, ఆగస్టు 17 : రైతులకు దుకాణాల్లో ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ అధికారి శేఖర్‌నాయక్ హెచ్చరించారు. అగళిలో శ్రీనివాస్ ఎరువుల దుకాణాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, సరైన ధరలకే విక్రయించాలన్నారు. లైసెన్స్ లేకపోతే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని, రైతులు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

టీడీపీలోనే వాల్మీకులకు పెద్దపీట: ఎంపీ, ఎమ్మెల్యే

మడకశిరటౌన్, ఆగస్టు 17 : వాల్మీకుల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని, వారి హక్కుల రక్షణకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కొల్లాపురమ్మ అమ్మవారి దేవాలయం ఆవరణంలో వాల్మీకుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడానికి బీసీల సహకారమే కీలకమన్నారు. వాల్మీకుల రిజర్వేషన్లకు మద్దతుగా పార్లమెంటులో తన వాణిని వినిపిస్తానని ఎంపీ పార్థసారథి హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే, గుండుమలను వాల్మీకి నాయకులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, వాల్మీకి సంఘం అధ్యక్షులు మోహన్, పట్టణ అధ్యక్షులు మనోహర్, నాయకులు ఓబుళేషు, నాగరాజు, కౌన్సిలర్ ఉమాశంకర్, తదితరులు ఉన్నారు.

మడకశిర రూరల్ : విద్యార్థులు బాగాచదివితే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సూచించారు. పేర్కొన్నారు. మండలంలో వైబి హళ్ళి ఉన్నత పాఠశాను తనిఖీ చేసిన ఆయన పాఠశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని ఏఆర్ రొప్పం గ్రామంలో ఎమ్మెల్యే, గుండుమల ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అక్రమ కట్టడాలు తొలగించాలి

మడకశిర(అమరాపురం) : అమరాపురం మండలంలోని హలుకూరు పంచాయతీ పరిధిలోని ఉదుగూరు గ్రామంలో రోడ్డుకు ఆనుకొని వైసీపీ మాజీ ఎమ్మెల్యే అక్రమంగా నిర్మించిన ప్రహరీని తొలగించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అక్రమ కట్టడాలను తొలగించడంలో ఎవ్వరికీ భయపడేది లేదని, స్వయంగా తానే రంగంలోకి దిగి తొలగిస్తానన్నారు.


ఎంపీ, ఎమ్మెల్యే, గుండుమలను సన్మానిస్తున్న దృశ్యం

గుడిబండ : మండలంలోని పిసిగిరి గ్రామంవద్ద వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల ప్రత్యేక పూజలు నిర్వహించారు. 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని ఎస్.రాయపురం గ్రామ సమీపంలో స్వయంగా క్రికెట్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. గ్రామంలో సమస్యలపై ఆరా తీశారు.

మడకశిర(అమరాపురం) : అమరాపురం మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యట చేశారు. బస్టాండ్, ఆరోగ్యకేంద్రం, కార్యాలయాలను పరిశీలించి సమస్యలపై ఆరా తీశారు. హలుకూరు అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బోరు వేసి నీటి సమస్యను పరిష్కరించారు.

పాత్రికేయులకు రుణపడి ఉంటా: మంత్రి


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ, ఆగస్టు 17 : సమాజంలో పాత్రికేయుల సేవలు మరువలేనివని, కష్టకాలంలో తనకు అండగా ఉండి సహకరించిన పాత్రికేయులకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పెనుకొండ నియోజకవర్గానికి చెందిన ఐదు మండలాల పాత్రికేయులతో మంత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను మంత్రిగా ఉన్నా ఎప్పటికీ విలేకరులకు అండగా ఉంటానన్నారు. పెనుకొండలో ప్రెస్‌క్లబ్ నిర్మిస్తామని, ఇల్లులేనివారికి ఇంటి స్థలం ఇస్తామని, జర్నలిస్ట్ పిల్లలకు ఫీజుల రాయితీపై ముఖ్యమంత్రి, చంద్రబాబు నాయుడుతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నాయకులు టైలర్ అంజనేయులు, రాంపురం సర్పంచ్ శ్రీనివాసులు, త్రివేంద్రనాయుడు, బాబుల్‌రెడ్డి, తదితరులుపాల్గొన్నారు.

బ్లాస్టింగ్‌పై స్పందించిన అధికారులు

● క్వారీ వద్దకు పరుగులు ● కలెక్టర్‌కు నివేదిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లేపాక్షి, ఆగస్టు 17 : పగటిపూట బ్లాస్టింగ్‌పై అధికారులు స్పందించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి' లో ప్రచురితమైన వార్తపై రెవెన్యూ అధికారులు ఆదివారం క్వారీ వద్దకు పరుగులు తీశారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, ఆర్ఐ ప్రమీళ, వీఆర్‌ఓ గంగరత్నలు క్వారీ వద్దకు వెళ్లి పరిశీలించారు. బయన్నపల్లి, మామిడిమాకులపల్లి, బసవనపల్లి గ్రామాలలో రైతులతో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన రైతులు బ్లాస్టింగ్ కారణంగా పంటలు దెబ్బ తింటున్నాయని, పిల్లలు అస్వస్థతకు గురవుతున్నారని వాపోయారు. కంకరపై కనీసం టార్పలిన్ వేయకుండా తరలిస్తున్నారని ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు నివేదికను కలెక్టర్‌కు పంపుతామన్నారు. అధికారుల ఆదేశాలు అందగానే క్వారీపై చర్యలు తీసుకుంటామన్నారు.


క్వారీ పనులు పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థి దశ నుంచే దేశభక్తి పెంపొందించాలి

హిందూపురం అర్బన్, ఆగస్టు 17: పాఠశాల దశలోని విద్యార్థి దశ నుంచే పిల్లల్లో దేశ భక్తి పెంపొందించాలని చిన్న పిల్లల వైద్యుడు అఫ్తాబ్ పేర్కొన్నారు. శనివారం పట్టణ పరిధిలోని ముక్కడిపేటలో అఖిల భారత షాహిద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్‌ఫరూక్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వతంత్ర వారత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిఘంటువులు అందించారు. విశ్రాంత సబ్ ఇన్‌స్పెక్టర్ ఇక్బాల్, రఫిక్, మౌలానా ఉస్మాన్ ఘనీ, మౌలానా షాబుద్దీన్, మౌలానా ఇస్మాయిల్, సల్మాన్, తన్వీర్,ఇందాదుల్లా ఇమ్రాన్ హాజరయ్యారు.


విద్యార్థులకు నిఘంటువులు అందజేస్తున్న దృశ్యం

ఆలయానికి రూ.3లక్షలు విరాళం

గోరంట్ల, ఆగస్టు 17: మండలంలోని వానవోలు గ్రామంలో పునఃనిర్మిస్తున్న కస్తూరి రంగనాథస్వామి ఆలయానికి వెంకటరామిరెడ్డి, కుటుంబ సభ్యులు రూ.3లక్షల 116లు విరాళం శనివారం అందజేశారు. చెన్నైకొత్తపల్లి మండలం చిన్నమొగలాయి పల్లెకు చెందిన రామిరెడ్డి జ్ఞాపకార్థం తండ్రి వెంకటరామిరెడ్డి, కుటుంబ సభ్యులు చెక్కు పూజారి శ్రీధర్‌కు అందజేశారు. కమిటీ సభ్యులు దాతకుటుంబ సభ్యులను సత్కరించారు.


విరాళం అందచేస్తున్న వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులు

భారీ వర్షం

మడకశిరటౌన్, ఆగస్టు 17 : నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మడకశిర మండలంలో 88.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అమరాపురంలో 98.2 మి.మీ., గుడిబండలో 41.6 మి.మీ., రొళ్లలో 62.2 మి.మీ., అగళి 42.6 మి.మీ. వర్షపాతం నమోదయింది. వర్షం కురవడంతో పట్టణంలోని రోడ్లన్నీ పలుచోట్ల జలమయం అయ్యాయి. చంద్రమౌళేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రధాన రహదారిపై నీరు భారీగా చేరడంతో బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. అదేవిధంగా సీపీఐ నాయకులు రోడ్డుపై నీటిలో నిలబడి నిరసన తెలిపారు.


బోల్తాపడిన బొలెరో వాహనం

రాకపోకలకు ఇబ్బందులు

పెనుకొండ రూరల్ : మండలంలోని గుట్టూరు సమీపంలోని మక్కాజిపల్లి తాండావద్ద రైల్వే అండర్ బ్రిడ్జి కింద నిలిచిన వర్షం నీటితో రాకపోకలు ఆగిపోయాయి. గుట్టూరు నుంచి వెంకటగిరిపాళ్యం, చంద్రగిరి, గొల్లపల్లి, తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు బంద్ అయ్యాయి.

శ్రీరాములు కుటుంబానికి అండగా ఉంటాం: రఘువీరారెడ్డి

పెనుకొండ రూరల్, ఆగస్టు 17 : గుట్టూరు శ్రీరాములు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని మాజీ మంత్రి రఘువీరారెడ్డి హామీ కల్పించారు. ఇటీవల జడ్పీటీసీ శ్రీరాములు గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న రఘువీరారెడ్డి శనివారం మండలంలోని గుట్టూరు గ్రామానికి చేరుకుని శ్రీరాములు కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరసింహులు, కేటీ శ్రీధర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.


శ్రీరాములు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నేతలు

విద్యుత్ షాక్‌తో ఇద్దరు యువకుల మృతి

పావగడ, ఆగస్టు 17 : విద్యుత్ షాక్‌తో ఇద్దరు యువకులు మృతి చెందారు. అడవి జంతువుల బారి నుంచి కాపాడటానికి ఏర్పాటు చేసిన తీగలు వారి పాలిట యమపాశాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అర్సికెర పోలీస్ స్టేషన్ పరిధిలోని టీఎన్ బెట్ట గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి 12గంటలకు ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అనిల్‌కుమార్(29), పుట్టరాజు(30)అనే యువకులు తమ పొలంలో సాగుచేసిన వేరుశనగ పంటకు కాపలాగా వెళ్లారు. పొలానికి అడవి జంతువుల నుంచి రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు ఊడిపడి ఉన్నాయి. కంచెపై వేసిన తీగలు ఊడిపడడంతో కంచెలో విద్యుత్ సరఫరా అవుతోంది. గమనించని యువకుడు తీగలను పట్టుకోవడంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. అతన్ని రక్షించేందుకు వెళ్లిన మరో యువకుడు అక్కడే మృతి చెందినట్లు ఎస్సై తారాసింగ్ తెలిపారు. శనివారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు, బెస్కాం అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పుట్టరాజుకు వివాహమై భార్య ఉండగా, అనిల్ కుమార్ దివ్యాంగుడు. వారి మృతితో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.


అనిల్‌కుమార్ (ఫైల్)


పుట్టరాజు మృతదేహం

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

పావగడ, ఆగస్టు 17 : అర్సికెరె పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన కరేకెతనహళ్లి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో శనివారం జేసీబీ డ్రైవర్ కుమార్(28) దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పావగడలోని శనీశ్వరుడిని దర్శించుకు నేందుకు వచ్చిన కుమార్ స్వామి తిరిగి వెళ్తుండగా కరేకేతనహళ్లి సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనం పంక్చర్ కావడంతో అదుపుతప్పి కింద పడ్డారు. అప్పుడే అటుగా వచ్చిన బొలెరో వాహనం తలపై దూసుకెళ్లడంతో కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ తారాసింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం పావగడ ఆసుపత్రికి తరలించారు

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

హిందూపురం(పరిగి), ఆగస్టు 17 : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను శనివారం అధికారులు సీజ్ చేశారు. మండలంలోని దాసరపల్లి గ్రామ సమీపంలో పెన్నానదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించి స్థానికులు తహసీల్దార్ హసీనాసుల్తానాకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆమె రెవెన్యూ సిబ్బందితో వెళ్లి హిందూపురం మండలం కొల్లకుంట, సింగిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

నేడు జిల్లా స్థాయి యోగాసన పోటీలు

హిందూపురం అర్బన్, ఆగస్టు 17: పట్టణ పరిధిలోని వివేకానంద యోగా థెరపి ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి యోగాసనాల పోటీలు నిర్వహించనున్నట్లు సత్యసాయి జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బదరి నారాయణ, కార్యదర్శి సుబ్బరాయుడులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఈవెంట్‌కు రూ. 100 ఎంట్రీ ఫీజు ఉంటుందన్నారు. విజేతలకు ప్రథమ, ద్వియ తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. సబ్‌జూనియర్స్‌కు 10 నుంచి 14 సంవత్సరాల లోపు ఉండాలని, జూనియర్స్ 14 నుంచి 18 సంవత్సరాలు, సీనియర్స్‌గ్రూప్ 18 నుంచి 28, సీనియర్స్ గ్రూప్ ఏలో 25 నుంచి 35, సినియర్స్ గ్రూప్ బిలో 35 నుంచి 45, సీనియర్స్ గ్రూప్ సిలో 45 నుంచి నుంచి 55 ఏళ్ళ వయసు ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్ కొరకు 9640979130, సిలబస్ కొరకు 8374037960ను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

హిందూపురం అర్బన్, ఆగస్టు 17: పట్టణ పరిధిలోని ఎం.ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ హయగ్రీవా ఆలయంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు 5వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 6.30 గంటలకు అభిషేకాలు, 10 గంటలకు హోమాలు, మహా మంగళహారతి, సాయంత్రం 5 గంటలకు కళ్యాణోత్సవం, 8 గంటలకు మహామంగళహారతి, విందు, 19వతేదీన 6.30 గంటలకు యజ్ఞోపవీతధారణ, 12 గంటలకు బ్రహ్మరథోత్సవం, 2 గంలకు మహా మంగళ హారతి, సాయంత్రం 6.30 గంటలకు శయనోత్సవం, 7.30 గంటలకు మహామంగళహారతి, 20వ తేదీ ఉదయం 9 గంటలకు చక్రస్నానం, ధ్వజారోహణ, మధ్యాహ్నం 12 గంటలకు శాత్తుమొరై, మహామంగళహారతి ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 17 : సోమందేపల్లి ఎస్ఐగా రమేష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న విజయ్‌కుమార్ వీఆర్‌పై వెళ్లారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల రక్షణకు కృషిచేస్తానన్నారు. మట్కా, గ్యాంబ్లింగ్, జూదం, అక్రమ మద్యం రవాణా తదితర వాటిపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

'టాస్'లో టీడీపీ మద్దతుదారులదే గెలుపు

హిందూపురం, ఆగస్టు 17 : ఇటీవల జరిగన పాఠశాల మేనేజ్‌మెంట్ ఎన్నికల సందర్భంగా వాయిదాపడ్డ మలుగూరు పాఠశాల ఎస్ఎంసీ ఎన్నికల్లో ఎట్టకేలకు టీడీపీనే విజయం సాధించింది. ఈనెల 8న ఇరువర్గాలు ఘర్షణ పడటంతో ఎన్నికలు వాయిదా వేశారు. శనివారం సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ముగ్గురు టీడీపీ, ముగ్గురు వైసీపీ మద్దతుదారులుండగా చైర్మన్ స్థానానికి సీఐ టాస్ వేయించారు. టాస్‌లో టీడీపీ మద్దతుదారులైన ఉష చైర్మన్‌గా, లావణ్య వైస్ చైర్మన్‌గా ఎన్నికైనట్లు ప్రకటించారు.

మేకలపల్లిలో..

హిందూపురం(సోమందేపల్లి) : మండల పరిదిలోని మేకలపల్లి గ్రామంలో బ్రహ్మసముద్రం వాసి గంగాధరప్పను ఏకగ్రీవం చేయడానికి ప్రయత్నించగా, ఉప్పర సిద్ధప్ప పోటీకి దిగారు. ఓటింగ్‌లో 22మంది పాల్గొనగా ఉప్పర సిద్ధప్పకు 13, గంగాధరప్ప 7ఓట్లు లభించాయి. ఉప్పర సిద్ధప్పను చైర్మన్‌గా, పార్వతమ్మను వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నట్లు అధికారులు ప్రకటించారు.